

పెళ్ళిపందిరి కళకళ్లాడుతోంది. రాత్రి ముహూర్తం......విద్యుద్దీపాలకాంతిలో పెళ్ళిపందిరికి చేసిన అలంకారాలు వింతశోభలు వెదజల్లుతున్నాయి.

ఊళ్ళోకల్లా పేరుమోసిన డాక్టరుగారి ఒక్కగానొక్క కూతురి వివాహం. పందిరినిండుగా జనం కూర్చున్నారు, .....మేళతాళాలు జోరుగా ఉన్నాయి. హాయిగొలిపే సన్నాయిపాటలో వలపుబాటలు వేసుకుంటున్నారు, పెళ్ళికొడుకూ—పెళ్ళికూతురూ—

పెళ్ళికూతురు మూర్తికి బాగా తెలుసు. పైగా వాళ్ళు తమకుటుంబానికి చుట్టాలయితే కాకపోవచ్చుకాని, అంతకంటే దగ్గర స్నేహితులు. ఆడపెళ్ళివారితరఫున పెళ్ళికి వచ్చినవాళ్ళని రిసీవ్ చేసుకుంటున్నాడు. అసలు ఆపని మూర్తికి డాక్టరుగారు అప్పచెప్పడానికి కారణం లేకపోలేదు. ఆయనఏకైకసుపుత్రుడు — శేఖరం ఆరడుగుల విగ్రహం మట్టుకే. బాధ్యత తెలీదు. వచ్చినవాళ్ళని ఎలా రిసీవ్‌చేసుకోవాలో కూడా తెలీదు. శేఖరం మెడిసిన్ చదువుకి డాక్టరుగారు—శేఖరం ఓపుష్కరంకాలం పాటు విశాఖపట్టణంలో ఉండటానికి సరిపోయే డబ్బు వేరే శేఖరం పేరుమీద బ్యాంకులోవేసి ఉంచారు....

మూర్తి వచ్చినవాళ్ళందర్నీ రిసీవ్‌చేసుకుని పెళ్ళిపందిట్లోకి తీసుకువెడుతున్నాడు శేఖరం ఏమూలో

44-వ పేజీ చూడండి




# రంజన్ డీలక్స్ పంకాలు

వేసంగి విసిగించితే రంజన్ ఆహ్లాదము నిచ్చును



# రెక్స్ జెల్లీ



## కంటికింపైనది.. మంచిరుచియైనది.. చాలామంచిది!

ఇదిగో వక్లరుచిగల ఫలహారము, దీనిని తయారుచేయుట ఎంతో సులభం. రెక్స్ జెల్లీ క్రిస్టల్సును వేడి నీటిలో కరిగించండి. తరువాత 1. పైంటు (20 ఔన్సులు) అగుటకు కావలసినంత చన్నీళ్లు కలపండి. దానిని ఒక అచ్చులోపోసి జెల్లీ గట్టిపడువరకూ మంచు గడ్డ మీద వుంచండి.

అది సులువుగా జీర్ణమయ్యే పుష్టికరమైన ప్రీతియగు ఇంటి ఫలహారము, కోలుకుంటున్న రోగులకు కూడా దివ్యమైనది.

రెక్స్ జెల్లీ క్రిస్టల్స్ 6 రుచులలో లభించుచున్నవి: రాస్ బెర్రీ, స్ట్రాబెర్రీ, లెమన్, పైనాపిల్, ఆరెంజ్, చెర్రీ.




కార్న్ ప్రొడక్ట్స్ కో., (ఇండియా) ప్రయివేట్ లి.,

దక్షిణ భారతదేశంలో ఏజెంట్లు: స్పార్ అండ్ కంపెనీ, లిమిటెడ్


# పడవప్రయాణం

16-వ పేజీ తరువాయి

ఎవరితోనో మాట్లాడుతూ కూర్చున్నాడు. పెళ్ళి ఎవరింట్లోనో అవుతున్నట్టుగా.

అంతలో ఓ మెరుపుతీగె మెరిసింది. ఓ కోయిల కూసింది—మూర్తి ఓక్షణం ఆ వచ్చిన అమ్మాయిలవైపు చూశాడు. ఆ వచ్చిన అమ్మాయిలు ఇద్దరిలోనూ ఓఅమ్మాయివైపు ఓక్షణం ఎక్కువే చూశాడు మూర్తి.

ఏమీ మాట్లాడకుండానే కళ్ళతోనే స్వాగతం చెప్పాడు మూర్తి. అక్కడ ఆడవాళ్ళని రిసీవ్‌చేసుకోడానికి నిలుచున్న పెళ్ళికూతురి అక్క (వరుసకి) వాళ్ళని లోపలికి తీసుకుపోయింది ఏమిటేమిటో మాట్లాడుతూ. వాళ్ళు మాట్లాడేతీరు చూస్తే ఎవరో చుట్టాలు అన్పించింది మూర్తికి...... ఎందుకో తన కీ అనుమానం—వాళ్ళు చుట్టాలైతేనేం—కాకపోతేనేం.......చుట్టాలైతే తనకు తెలియనివాళ్లే వర్తై ఉంటారు. ఏమో ఎందుకు కాకూడదూ......ఎక్కడైనా దూరప్రదేశాల్లో ఉంటున్నారేమో?.........

ఆ అమ్మాయిలు లోపల పెళ్ళికూతురుదగ్గరకు వెళ్లారు. "వచ్చాం" అని చెప్పడానికేమో! అన్నట్టుగా....... ఓ అమ్మాయి పెళ్ళికూతురిని "అదేమిటే లక్ష్మి—బయట గుమ్మందగ్గర మీ అక్క తప్పితే మరెవ్వరూలేరు. శేఖరంబావ ఏడీ—?" అనడిగింది.

పెళ్ళికూతురు చిన్న నవ్వు నవ్వింది. "ఏమోనే! ఎక్కడున్నాడోనూ. అయినా మూర్తిగా రున్నారుగా అక్కడ" అనేసింది. "అయినా జ్యోతీ శేఖరం బావను చూడాలనా—లేకపోతే మనతరఫువా రెవరూ గుమ్మందగ్గర లేరనా—" అంది నవ్వుతూ...... జ్యోతి మాట్లాడలేదు. "ఇంతకూ గుమ్మందగ్గర నుంచున్న ఆయన ఎవరూ!? చెప్పావుకాదే—ఎప్పుడూ చూసినట్టుగా జ్ఞాపకంలేదు—" అంది ఆ రెండో అమ్మాయి.

"ఆయనే శారదా మూర్తిగారంటేను......అది సరేకాని, ఇప్పుడా రావడం...... ఓ వారంరోజులు ముందరగానే రమ్మని వ్రాయడం దండుగే."

అంతలో పెళ్ళికూతురి స్నేహితులు ఎవరో వచ్చారని చెప్పడానికి మూర్తి అక్కడకు వచ్చాడు....

"మూర్తిగారూ......వీళ్ళు మా మేనమామగారి అమ్మాయిలు శారదా—జ్యోతి. అని వాళ్ళిద్దర్నీ పరిచయంచేసి ఈయన మూర్తిగారు......ఎడ్వకేటు.... మనఇంట్లో శేఖరం ఎంతో ఈయనా అంతే" అంటూ పరిచయంచేసింది.

మూర్తి ...... అంటే "వారం రోజులక్రితం నుంచి 'ఎక్స్పెక్ట్' చేస్తున్నారు వీళ్ళనేనా" అన్నాడు వాళ్ళనుగురించి తనకు తెలిసినట్టుగా.

"ఆ! వాళ్ళే—నయం ఇప్పుడేనా వచ్చారు. ఏమయినా అంటే యూనివర్శిటీపరీక్షలూ—లేకపోతే మరోటీనూ."

"అదికాదు లక్ష్మి—నాన్నగారికి సెలవు దొరకలేదు. మొన్నటివరకూ సెలవు గ్రాంటు అవుతుందనే అనుకున్నాము ...... మొన్నకూడా తెలియక

పోవడంతో మమ్మల్ని పంపించారు నాన్నగారు"...... అంటూ మాట్లాడుతున్నారు.

అంతలో "హల్లో ఎప్పుడు రాక?" అంటూ అక్కడకు వచ్చాడు శేఖరం.....

"రాణీగార్లకు తీరుబాటయ్యిందనుకుంటాను. అయినా ఓరెండురోజులపాటు ముందరవస్తే ఏం పోయింది!......."

"వచ్చి గంటసేపయితే ఇంతవరకూ దర్శనం లేకపోతే ఇంక రెండురోజులు ముందరవస్తే అయ్యేదే..."

"నీ వెర్రికాని — వాడు పెళ్ళిపీటలదగ్గర ఎందుకు కన్పిస్తాడే.....ఎవరితో కబుర్లుచెబుతూ కూర్చున్నాడో......"

"ఒసేవ్—అక్కయ్యా — ఇంకేమైనా అంటే ఊరుకునేది లేదు. ఇంతకూ అత్తయ్యేదీ—జ్యోతీ..."

"వెనకాతల వస్తోంది.....మరో రిక్షాలో."

అంతలో మూర్తి ఓ ట్రేలో డ్రింకులు తెప్పించాడు. శారదా—జ్యోతీ డ్రింకులు తీసుకున్నారు....

అంతలో పెళ్ళికూతుర్ని పిలువడంతో లోపలికి వెళ్ళిపోయింది "మూర్తిగారూ, మీరూ, శేఖరం వాళ్ళతో మాట్లాడుతూ వుండండి" అంటూ.

మూర్తికి ఏం మాట్లాడాలో తోచలేదు. చివరకు, "గుమ్మందగ్గర ఎవరూ లేరనుకుంటాను...." అన్నాడు. "పోనీ మనం అందరం అక్కడే నిలుచుందాం—" అన్నాడు శేఖరం. అంతక్రితం ఈ ఉత్సాహం అంతా ఏమయ్యిందో అన్పించింది మూర్తికి.

ఆ నలుగురూ గుమ్మందగ్గర నిలుచుని వచ్చిన వాళ్ళకి స్వాగతం చెబుతున్నారు. పెళ్ళికూతురి స్నేహితులు ఎవరైనా (తనకి తెలిసినవాళ్ళు) వస్తే వాళ్ళకు పరిచయంచేస్తున్నారు శేఖరం.

వచ్చినవాళ్ళలో సగంమంది మూర్తిని 'హల్లో' అని పలుకరించడం కొంచెం ఆశ్చర్యంగా కనుపించింది శారదకు. మూర్తివైపు అంతక్రితం చూడనంత పరీక్షగా చూసింది శారద. మూర్తి ఎవరితోనో మాట్లాడుతూ—అట్టే పెద్దవాడిలా కనుపించలేదు. పడత నలుగని అతని నూటూ—ఆ విగ్రహం చాలామందిని ఆకర్షించాడు. ఎవరో ఒకాయన అడుగుతున్నాడు మరొకర్ని—"ఆగుమ్మంలో నిలుచున్నది మూర్తికదూ!" అని.

"ఓ కాబోయే పెళ్ళికొడుకు......" జవాబు.

"ఓహో! ఓ ఆడపిల్లతండ్రి అన్నమాట" అనుకుంది శారద.

పెళ్ళి పూర్తయ్యేటప్పటికి అర్ధరాత్రి దాటిపోయింది. పెళ్ళికి వచ్చినవాళ్ళకు తాంబూలాలు ఇచ్చేసమయానికి మళ్ళీ ఆ నలుగురే కనుపించారు పందిట్లో.

*  *  *

మర్నాడు రాత్రి ఊళ్ళో పెద్దలందరికీ విందు ఏర్పాటుచేశారు డాక్టరుగారు. విందు పూర్తయ్యేవరకూ మూర్తి హడావుడిగా తిరుగుతూనే వున్నాడు.

డాక్టరిగారితో—"మీ . శేఖరం—మూర్తిగారూ చాలా బాగా చేస్తున్నారండీ ఏర్పాట్లు" అన్నారు—ఉన్నరు చాలా బావుందని అభినందిస్తూ ఎవరో ఒకాయన.

"శేఖరాని దేముందిలెండి. వాడిమొహం. పాపం మూర్తే అంతా చూస్తున్నాడు." ఈ మాటలు విన్న శారదకి, మూర్తికి ఆ ఇంట్లోవున్న విలువ అర్థమయ్యింది.

"రాకరాక వచ్చారు. ఎన్ని సంవత్సరాలైందో మిమ్మల్ని కలుసుకుని. నేను తిరిగివచ్చేదాకా వెళ్ళడానికి వీల్లేదు" అంది పెళ్ళికూతురు పెళ్ళివారితో వెడుతూ.

"సయం. నీ కూడా రమ్మన్నావుకాదు" అంటూ నవ్వేసింది శారద.

"మూర్తిగారూ.....వీళ్ళకి ఈ ఊరంటే ఓ పల్లెటూరులా ఉంటుంది. పట్టణవాతావరణానికి అలవాటుపడ్డవాళ్ళు.......ఇక్కడ కొంచెం కొత్తగా ఉంటుందేమో!......నేను వచ్చేలోపుగా వీళ్ళు వెళ్ళిపోకుండా చూసేబాధ్యత మీది......" అని.

"శారదా! ఈయన్నుగురించి మీకు నేనేమీ చెప్పక్కర్లేదు. ఇప్పటికే చాలా తెలిసిఉంటుంది. మన ఇంట్లో శేఖరం ఎంతో ఈయనా అంతే" అనేసింది.

"అదేమిటే అక్కయ్యా. నాకు తెలీదు గెస్టును ఎలా ట్రీట్‌చెయ్యాలో....అంతగా చెప్పాలా...?" శేఖరం మాటకు "నీకే తెలియాలి. రాగానే కప్పుకాఫీ అయినా ఇవ్వలేదు" అనేసింది జ్యోతి నవ్వుతూ......

ఆరోజు పొద్దున్న మూర్తి, శేఖరం—జ్యోతీ, శారదా మాట్లాడుతూ కూర్చున్నారు.

"ఇవేళ సాయంత్రం సినిమాకు వెడదాం" అన్నాడు శేఖరం.

'ఇదా మాకోసం నువ్వు ఏర్పాటుచేసిన ప్రోగ్రాం' అన్నట్టుగా చూసింది జ్యోతి.

"పడవషికారు మీ కిష్టమేనా" అన్నాడు మూర్తి. "వండర్‌ఫుల్......" అంది శారద.

"చాలా బావుంటుంది...." అంటూ బలపరచింది జ్యోతి.

తన అయిడియా వీటో అయిపోతున్నందుకు శేఖరానికి కొంచెం బాధకలిగినమాట వాస్తవం. ఎలాగైనా తనమాట నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో

"ఈ ఊళ్ళో మీ ఊళ్ళోలా బోటు క్లబ్బులేంలేవు. వెడితే కంట్రీబోటుమీద వెళ్ళాలి. అయినా పెద్దవాళ్ళు ఒప్పుకోవద్దూ—నదిలో పడవవిహారానికి వాళ్ళ పర్మిషన్ తీసుకోవడం చాలా కష్టం....... సినిమా క్రొత్త థియేటర్‌లోకి వచ్చింది. థియేటర్‌కూడా చాలా బావుంటుంది. సినిమాకి అయితే నాన్నగారు సులభంగా ఒప్పుకుంటారు."

"ఇంతోటి థియేటర్లు మాఊళ్ళో లేవు కనుకనా! మా ఊళ్ళో చిన్న లేక్‌లోనే బోటు షికారు చాలా బావుండేది. ఇక్కడ ఇంత పెద్ద నదిలో ఎంత బావుంటుందో" అడ్డుతగిలింది జ్యోతి.

"ఏయ్ జ్యోతీ—నామాట వింటావా? వినవా?" అనేశాడు శేఖరం.

శారదకు ఏం చెప్పడానికీ తోచక "మీ రేమంటారూ?" అన్నట్టుగా చూసింది మూర్తివైపు.

"మీరందరూ ఏమంటే నేనూ అదే! అయినా ఆ పిక్చరు నిన్ననే రిలీజయ్యింది......"

"టిక్కట్లు దొరకవు అని అనుమానమా..... టిక్కెట్లు తెచ్చేబాధ్యత నాది" ధీమాగా అన్నాడు శేఖరం.


శ్రీబాలాంజనేయ ప్రశ్న

సంతానము, రోగములు, గ్రహబాధలు, వివాహం, పారిపోయిన పశువులు, మనుష్యులయొక్క ఆచూకీ, దొంగిలించిన సొమ్ము, విడిపోయినభార్య విగైరా కోరిన 5 ప్రశ్నలకు వెంటనే జవాబు పంపగలము. రూ 2 ఎం.ఓ. చేయండి. నెలలవారీగా 12 నెలలకు 1 సంవత్సరం జాతకము రూ 2. పూర్తిపేరు, జాబువ్రాసిన టైము తెలిపిన చాలును.

హనుమాన్ జ్యోతిషాలయము,
10వ లైను, అరండల్ పేట, గుంటూరు2.

RATNAM'S N-OIL
(పైపూతకుమాత్రమే)

అంగనరములు బలహీనతి చెంది, చిన్న దినచో తిరిగి యథాప్రకారం అం పూర్తి సౌఖ్య మనుభవించుటకు 50 సం ప్రఖ్యాతి కలది. 1 సీసా రూ. 10 వి. పి. 1-4-0 కావలసినవారు ముందుగా 1-4-0 పంపేది. ఇంగులో స్పెషల్ రక అర్గంటుగుణమునకు 25-0-0 అ.

డాక్టర్. రత ..., (Estd 1904)
... , అజంపూరా ...
వద్ద, హైద్రాబాద్-24 (ఆంధ్రప్రదేశ్)





## పూవు మీ అదృష్టం చెప్పగలదు.

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ పరిపూర్ణ దర్శనముగురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేది, వేళ వివరములున్నూ, మీ పరిపూర్ణ చిరునామా యున్ను వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రమే వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైనపంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల సొకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. Dev Dutt Shastri, Raj Jyothishi (W. P.) JULLUNDUR CITY.





## ఆహార లోటువల్ల మీరు నీరసించిపోతున్నారా?

## ఆల్బో-సాంగ్ సేవించండి

దివ్యమైనది మరియు సామాన్య పోషక ఆహారమును పొదుపుగాను వైజ్ఞానికంగాను బలపరచును.

టీ, కాఫి, పాలు, గంజి, పళ్ల రసం మొదలైనవాటితో కలిపితే ప్రీతైన రుచిగలది. అల్బో-సాంగ్, శిశువులకు, ఎదిగే పిల్లలకు, చంటి బిడ్డ తల్లులకు, మెదడునుపయోగించే పనివారికి, వృద్ధులకు, బలహీనతకు, రక్తహీనతకు మరియు రోగ విముక్తులై కోలుకుంటున్న వారికి, దివ్యమైనబలవర్ధక ఆహారము




పౌడర్‌గాను, బిళ్లలుగాను దొరుకు చున్నది.

**జె. అండ్ జె. డిషేన్**
హైదరాబాద్


# పడవ ప్రయాణం

ఏమయినా వాళ్ళంతా ఒకటే......తమ ఎదుర్తు తిరిగితే తనకి ఓటమి తప్పదనిపించింది మూర్తికి.

"మీకుకూడా సినిమాకు వెళ్ళాలనేవుంటే సీట్లు రిజర్వ్‌చేయిస్తాను."

"మీరు ఊరుకోండి మూర్తిగారు. మనం బోటు షికారే వెడతాం—మొదటివారం సినిమాకు వెళ్ళడం బావుండదు......" అంది అంతవరకూ నిశ్శబ్దంగా వున్న శారద. ఏమయినా సినిమాప్రోగ్రాం కేన్సిల్ అన్నట్టుగా.

అంతలో డాక్టరుగారు అక్కడకు రావడంచూసి, "చూడు నాన్నా బోటుషికారు వెడతారుట..... ఇవేళ సాయంత్రం కంట్రీబోట్సులో......" వాళ్ళ బోటుషికారు ప్రోగ్రాం ఎలాగైనా మార్పించాలనే పట్టుదలతో డాక్టరుగారికి ఫిర్యాదుచేశాడు శేఖరం.

"అవును మావయ్యా—సినిమాలు ఎక్కడైనా వుంటాయి. బోటుషికారు వెడదాం మావయ్యా" అంది జ్యోతి.

"నువ్వేమంటావే శారదా......మూర్తి! నీ అయిడియా ఏమిటి."

ఈ ప్రతిపాదన ఆయనదే మామయ్యా.... అందరంకలసి బోటు షికారువెడితే బావుంటుంది కదూ—!" అంది శారద.

"దానికేమే. చాలా బావుంటుంది. మేమూ ఎప్పుడో చిన్నప్పుడు వెళ్ళాం ఇసుకతెప్పలమీదకు పిక్నిక్......ఆ! అన్నట్టు ఇవి వెన్నెలరాత్రులు కూడానూ—బోటుషికారేమిటి. పిక్నిక్ వెడదాం—ఇసుకతెప్పలమీదకు" అనేసి ఏర్పాట్లు చూడమని పురమాయించారు మూర్తికి.

"హు!" మేమే నెగ్గాం అన్నట్టు చూసింది జ్యోతి. శేఖరం ఓటమి అంగీకరించక తప్పలేదు.

*　　*　　*

పెళ్ళికి వచ్చిన చుట్టాలు కొంతమంది—లక్ష్మికి కాలేజీలో స్నేహితురాళ్ళు కొంతమంది పిక్నిక్‌కు బయలుదేరారు. డాక్టరుగారూ మరికొందరు పెద్దవాళ్ళతో సహితం.

శేఖరానికి అసలు బోటుషికారంటే చాలా ఇష్టం—అయితే ఆ ప్రపోజల్ తన నోటంపట రాక పోవడంతో మూర్తిమాట నెగ్గటం ఇష్టంలేక పట్టుబట్టాడు. అయితే అందరూ అదేమాట అనడంతో శేఖరం మాట్లాడకుండా బయలుదేరాడు.

పుచ్చపువ్వులాటి వెన్నెల—ఆకాశంమీద ఎక్కడా మచ్చుకైనా మబ్బుతునకలేదు. పెద్దవాళ్ళందరూ ఓపడవలో కూర్చున్నారు. కుర్రకారంతా మరో పడవలో జేరారు.

మందంగా నడుస్తోంది పడవ. శారద ఎవరో కొంతమంది అమ్మాయిలతో మాట్లాడి పడవ అంచుకుజేరి నీటిలో చేతులుపెట్టి ఆడుతూ, కూని దీర్ఘాలు తీస్తోంది.

జ్యోతి నిశ్శబ్దంగా కూర్చుంది ఆకాశంవైపూ— బ్రిడ్జిమీద పోతున్న రైలువైపూ చూస్తూ.

"చాలా బావుందికదూ—మీ ఊళ్లో అయితే బోట్ రైడ్ ఇంత బావుంటుందా!?—"

శేఖరం మాటకు, "అవునవును—సినిమా అయితే ఇంకా బావుండేది" కొంటెగా జవాబిచ్చింది జ్యోతి.

ఈమాటలేం మూర్తికి వినిపించటంలేదు. అతను చూస్తున్నదల్లా పడవఅంచున కూర్చున్న శారదనూ— వింటున్నదల్లా ఆమె తీస్తున్న కూనిదీర్ఘాన్ని.....

ఉత్తరంవైపు ఉన్నందుకు ఆమెలో వచ్చిన మార్పు ఆమె కట్టిన చీరెపైన కప్పుకున్న కాశ్మీర్ శాలువాలలో ప్రతిబింబిస్తోంది. ఆమెను అంత సేపు కన్నార్పకుండా చూసిన తరువాత అర్థమయ్యింది ఆరోజు పెళ్ళిపందిట్లో తన స్నేహితులు ఎంతో మంది—ఆ అమ్మాయి ఎవరూ! — ఆ అమ్మాయి ఎవరూ! అని అడగడానికి కారణం....

పడవలో ఎవరూ మాట్లాడటంలేదు. ఇది కని పెట్టిన మూర్తి........"ఏం శేఖరం! ఓపాట పాడ కూడదూ?" అన్నాడు. తిన్నగా శారదను పాటపాడ మంటే ఏమనుకుంటుందో అని.

శేఖరం ఏకళనున్నాడో, "ఇక్కడ పాడటం వచ్చినవాళ్లందరూ ఒక్కోపాట పాడేటట్టయితే." సరే అంటే సరే అన్నారు అందరూ.

"అందమైన నీ మోము చందమామ లాగుంది" అంటూ, పాడేసి—"జ్యోతి—ఇప్పుడు నీ వంతు!" అంటూ వార్నింగ్ ఇచ్చాడు జ్యోతికి.

ఏమీ బ్రతిమాలించుకోకుండానే మొదలుపెట్టింది జ్యోతి.

"కోతి బావకు పెళ్ళంటా—కోవెలతోటా విడి దంటా......" శేఖరం మూతిముడుచుకున్నాడు.

శారద హిందీ పాట పాడింది. ఎవరికి తోచినపాట వాళ్ళు పాడారు.

చివరకు మూర్తివంతు వచ్చింది. ఏం పాడాలో అర్థం కాలేదు. "నాకేం పాటలు రావండి—నేపాడుతే మీరంతా నవ్వుతారు" అనేసి తప్పించుకుందామని చూశాడు.

"పిక్నిక్స్‌లో అందరూ పాడతారండీ...... అసలు పాటలు రానివాళ్ళుకూడా పాడతారు తక్కిన వాళ్ళు అడుగుతే!" అంటూ ఉత్తర హిందూదేశంలో విద్యార్థులనుగురించి, వాళ్ళు ఎలావుంటారో — వాళ్ళలోకూడా అమ్మాయిలవెంట తిరిగేవాళ్లెలా వుంటారో—వాళ్ళను అమ్మాయిలు ఎలా ఏడి పిస్తారో అన్నీ చెప్పేసింది. ఏం మాట్లాడుతోందో— చుట్టూ ఎవరున్నారోకూడా మర్చిపోయి ......, పైగా ఇక్కడ 'పైవాళ్లెవరున్నారు నవ్వడానికి?' అనేసింది.

చివరికి మూర్తికి పాట పాడక తప్పిందికాదు.

"నా హృదయంలో నిదురించే చెలీ—"

కలలలోనే కవ్వించే సఖీ....." అనుకోకుండా పాడేశాడు.

"చాలా బావుంధండి—అన్నారు శారదా, జ్యోతి, తక్కినవాళ్లూనూ.

శేఖరం మనస్సు చివుక్కుమంది.

తను అంతక్రితం ఆ వాతావరణానికి తగ్గట్టుగా, బ్రహ్మాండంగా 'అందమైన నీ మోము చందమామ లాగుంది' అని పాడుతే ఒక్కరైనా అనలేదు 'బావుంది' అని (మాట వరసకైనా.)

మూర్తి ఆ గంటలోను తెలుసుకున్న దేమిటంటే శారదా, జ్యోతీ—తక్కినవాళ్ళూ తను ఎంత చెప్తే అంత. శేఖరం చిన్నబుచ్చుకోవడం కూడా గమనిస్తూనే వున్నాడు. అయితే మూర్తికి అనుమానం కలిగింది— జ్యోతిసరే! శేఖరానికి తగ్గది. అతనేమంటే దానికి ఎదురు. అందుకని తనపక్షం జేరుతోంది. అయితే శారద తనవైపే ఉండటానికి కారణం—తను పైవాడనీ, ఏమైనా అనుకుంటాడనీనా—ఆఁ! అలా అయితే 'ఇక్కడ పైవాళ్లెవరున్నారు మీ పాట చూసి నవ్వడానికి' అని ఎందుకు అంటుంది? బహుశా శేఖరాన్ని ఏడిపించడానికి తనని సపోర్టుచేస్తోం దేమో!—ఒకవేళ తనను సపోర్టు చెయ్యాలనే చేస్తోందేమో!?— ఎందుకో ఆ ఆలోచన చెప్పలే నంత ఆనందాన్ని ఇచ్చింది అతనికి.

పడవలు ఓగంటసేపు నదిలో తిరిగి, ఇసుక తిప్పలు చేరుకున్నాయి.

ఇసుకతిప్పలమీద డాక్టరు సహితం కొద్దిగంటల పాటు తను ఏ శ్వైయ్యోపడిలోవాడిని అన్నమాట మర్చిపోయి—చెడుగుడూ చాకలిబాన ఆటలు ఆడే శారు.

పిక్నిక్‌కి వచ్చిన ప్రతివాళ్ళూ — చాలా బావుం దంటే చాలా బావుందనడంతో మూర్తికి కాంప్లి మెంట్స్ కుప్పలుకుప్పలుగా అందాయి.

వచ్చిన పెద్దవాళ్ళందరికీ తమ చిన్నతనం జ్ఞాపకంచేసింది ఆ పిక్నిక్. మూర్తిలాంటి కుర్ర కారుకి—శ్రావ్యమైన గొంతులూ—అందమైన ఆకా రాలు—ఆ పిక్నిక్‌ను మరచిపోకుండా చేశాయి.

మెల్లిగా తీసుకువచ్చిన సామాను పడవల్లోకి జేరే స్తున్నారు. అది కుర్రకారుకి వంతువేసి పెద్దవాళ్ళం దరూ పడవలోకి జేరుకున్నారు.

ఇంచుమించుగా సామాన్లన్నీ పడవలోకి జేరే శారు. చివరకు ఓ బిందె మిగిలిపోయింది. శేఖరం సామాను జేరెయ్యడంలో కొంచెం కూడా సాయం చెయ్యకపోవడం గమనించాడు మూర్తి.

"శేఖరం—ఆ బిందె నీ వంతు. నువ్వు పట్టుకు వచ్చెయ్యి."

నేను బిందె పట్టుకువస్తానా అన్నట్టుగా, "శారదా—ఆ బిందె నువ్వు పట్టుకొచ్చెయ్యి" అని పురమాయించాడు.

"శేఖర్ ఆ బిందె నీ వంతు — అది నువ్వు పట్టుకు రావాలి" మళ్ళీ అన్నాడు మూర్తి.

"నేనయితేనేం? శారద అయితేనేం!? బిందె పడవలోకి తీసుకురావడమేగా......"

"ఆ బిందె శారద పట్టుకురాకుండా చేస్తాను" అనుకోకుండా అనేశాడు మూర్తి.



ఇంటిల్లిపాదికీ ఆనందం చేకూర్చే

**ఆంధ్రసచిత్రవారపత్రిక**

తప్పక చదవండి!

# తరచుగా మూత్రవిసర్జన

చక్కెరతోగాని, చక్కెర లేకుండగాని తరచుగా మూత్రము వెలువడుట మిక్కిలి ప్రమాదకరమైన చిహ్నము. శరీరాన్ని గుల్ల చేయడమే కాకుండా ఈ వ్యాధి, తన బంధంలో చిక్కినవారిని ఆరోజుకారోజు మృత్యువుకు ఆసన్నుని చేయును. ప్రథమదశలో శారీరక, మానసిక శ్రమలకు యిచ్చగించకుండుట, నడుములో నొప్పి, చూపుమాంద్యము, తొడల్లో తిమ్మిరి, నరముల బలహీనతతో ఈ వ్యాధి పొడచూపును. పై లక్షణములతో కూడిన వ్యాధికి వెంటనే తగిన చికిత్స చేయించకున్నచో, అధికదాహం, ఆకలి, గొంతు నోరు యెండుట, దురదలు, కాళ్ళలో పగుళ్ళు, తూకం తగ్గడం, శరీరమంతా పోట్లు, కీళ్ళనొప్పులు, కంటిపొరలు, క్షయ, గడ్డలు, రాచపుండ్లు, ఇట్టి భయంకర బాధాకరమైన వ్యాధులు యెన్నో సంభవింపవచ్చును.

"వీనస్ ఛారమ్" మాత్రలు వాడి అనేక వేలమంది తమ బాధలనుండి నివారణపొంది మృత్యు కరాళమునుండి రక్షింపబడిరి. "వీనస్ ఛారమ్" శాస్త్రీయ పద్ధతులమీద ప్రాచీన యూనాని వైద్య విధానం ప్రకారం అమూల్య ఔషధుల శాకపదార్థముల, స్వాభావిక క్షారముల సారముతో తయారైనవి. "అమిత దాహము, మూత్రంలో చక్కెర తగ్గి పలుమారు మూత్ర విసర్జనచేయు అవసరము 2 లేక 3 రోజులలోనే మీకు చాలా భాగము నివారణ యగును. కొద్దిరోజులలోనే మీకు సగానికిపైగా స్వస్థత చేకూరినట్లనిపించును. "వీనస్ ఛారమ్" కొద్ది వ్యయముతో సుఖముగా, తేలికగా సేవించవచ్చును. దీనికి ప్రత్యేక పథ్యములేదు. నిరాహారముతోనుండే అవసరంలేదు. రోగులు పుష్టికరమైన ఆహారము తినేందుకై ఇదివరకటికంటే ఎక్కువ రకాల ఆహార పదార్థములు తీసికొనవచ్చును. వివరములుగల ఇంగ్లీషు కరపత్రములు అడిగినవారికి ఉచితముగా పంపబడును. 50 బిళ్ళల ఖరీదు రు. 6—75 న. పై. మాత్రమే. పోస్టేజి నిమిత్తం రు. 1—6 న. పై. అదనం. (ఒకేసారి రెండు) అంతకుపైగా సీసాలను తీసికొన్నచో పోస్టేజి ఉచితం,

(SELLING AGENTS)
Barrys Commercial Corporation
(A. P. W.)
27/A, Dhurumtollah Street
CALCUTTA - 13.


# పడవప్రయాణం

"అదీ చూద్దాం" అనేసి, "శారదా బిందె తొందరగా పట్టుకురా" మళ్ళీ కేకవేశాడు శేఖరం.

ఇదంతా అక్కడేవున్న జ్యోతి వింది.

మూర్తికి తనమాటమీద వాళ్ళకి ఏమాత్రం విలువవుందో తెలుసుకోడానికి మంచి అవకాశం దొరికింది. అప్పటికే శారద ఆ బిందె చేతుల్లోకి తీసుకుంది.

"ఆ బిందె అక్కడే వదిలెయ్యండి—తీసుకు రావద్దు" కేకవేశాడు మూర్తి. మూర్తివైపు చూసింది.

ఆబిందె అక్కడే వదిలేస్తుందేమో! అన్న అనుమానం పట్టుకుంది శేఖరానికి.

"శారదా......నీకే చెప్పేది......తొందరగా పట్టుకురా" ఆజ్ఞాపిస్తున్నట్టుగా అన్నాడు శేఖరం.

"అది అక్కడే వదిలెయ్యండి......" ఆజ్ఞాపిస్తున్నట్టుగాలేదు బతిమాలుతున్నట్టుగా అసలే లేదు.

"అక్కయ్యా వీళ్ళిద్దరూ పందెం వేసుకున్నారే" కేకేసింది జ్యోతి. తక్కున వదిలేసింది ఆబిందె శారద.

శేఖరంమొహంమీద కొట్టినట్టయింది.. తట్టుకోలేకపోయాడు.

"పోనీ నే తీసుకురానా బావా....అయినా అక్కయ్య నీమాటెందుకు వింటుంది......" అన్న జ్యోతి మాటలు పుండుమీద కారంజల్లినట్టు అయ్యింది శేఖరానికి.

శేఖరంమొహం కందగడ్డలా అయిపోయింది. మూర్తికి 'ఇంతవరకూ ఎందుకు రానిచ్చానా' అనిపించింది. మెల్లిగా తనే వెళ్ళి, ఆబిందె చేతులోకి తీసుకున్నాడు. అంతలో శారద మళ్ళీ తిరిగివచ్చి, ఆ బిందెను మూర్తి చేతులోనుంచి తీసేసుకుంది. "మీకెందుకండి? ఆడవాళ్ళం మేం ఉన్నాంగా" అంటూ.

మూర్తి ఇలా జరిగినందుకు సంతోషించినా శేఖరం చిన్నబుచ్చుకున్నాడని బాధపడ్డాడు.

శేఖరం తిరుగుప్రయాణమంతా నిశ్శబ్దంగానే కూర్చున్నాడు. జ్యోతి జరిగినవిషయం డాక్టరుగారితో చెప్పింది.

డాక్టరుగారు—గట్టిగా నవ్వేసి—"అది మూర్తిమాట వినక నీమాటెందుకు వింటుందిరా......" అనేశారు.

ఏమయినా ఆ ఒక్క చిన్న దెబ్బలాటా లేకపోతే ఇంకా బావుండేది ఆ పిక్నిక్ అనిపించింది మూర్తికి—

"ఐ ఆమ్ సారీ శేఖరం......నువ్వు ఏదో సరదాగా తీసుకుంటావనుకున్నాను."

"అబ్బే! నేనేం సీరియస్‌గా తీసుకోలేదు" అనేశాడు శేఖరం లేనినవ్వు తెచ్చిపెట్టుకుంటూ.

* * *

రెండు మూడురోజులు గడచిపోయాయి. రోజూ ఏదో ప్రోగ్రాంతో సరదాగా గడిపేశారు.

ఆరోజు లక్ష్మి తిరిగివచ్చింది...లక్ష్మికి, శారదా—జ్యోతి పిక్నిక్‌నుగురించి ఎంతో గొప్పగా చెప్పేసి, 'అరే—నే లేకపోయానే' అనుకునేలా చేసేశారు. వాళ్ళు ఆ ఊరును అంత పొగడటం వినడం లక్ష్మికి అదే మొదటిసారి.

లక్ష్మి—మూర్తితో మాట్లాడుతూ—'శారదా జ్యోతి మిమ్మల్ని గురించి చాలా చెప్పారండి—మిమ్మల్నీ ఈ ఊరుని మరచిపోలేరు వాళ్ళు" అంది.

* * *

ఓ వారంరోజులు ఆపగలిగారు వాళ్ళని....వెళ్ళిపోతూ, శారద మూర్తితో అంది......

"కోర్టు ఎలా ఉంటుందో చూద్దామనుకున్నానండీ— మా ఊళ్ళో ఎవరితో వెళ్ళాలో తెలీదు—ఇక్కడైతే మీతో వచ్చేదాన్ని" అంది.

"అరే! మాటమాత్రం చెప్పివుంటే తీసుకువెళ్ళేవాడినిగా'.'

"పోన్లేవే—ఈసారి వచ్చినప్పుడు చూద్దువుగాని.......అయినా మళ్ళీ ఎప్పుడు రావడం!?...." ప్రశ్నించింది లక్ష్మి.

"ఇటువంటి పిక్నిక్‌లూ—కంపెనీ ఉంటే ప్రతీ సెలవులకీ ఇక్కడికే వస్తాం—"

శారదా జ్యోతిల జవాబు లక్ష్మికి కొంచెం ఆశ్చర్యమే కలిగించింది. నవ్వేసి ఊరుకుంది.

* * *

శారద, జ్యోతీలు వెళ్ళిన కొద్దిరోజులకే—డాక్టరుగారు మూర్తితో మాట్లాడుతూ........వాళ్ళ మాట మాట్లాడారు.

"మంచి కంపెనీఅండీ......చాలా సరదాగా ఉంటారు" మూర్తిమాటలు విన్న డాక్టరుగారి మొహంమీద చిరునవ్వు కనుపించింది మూర్తికి.

"వాళ్ళ నాన్నగారిదగ్గిరనుంచి ఉత్తరం వచ్చిందోయ్! మీ నాన్నతో మాట్లాడాలి—ఉన్నాడా"

"ఏంలేదోయ్—ఆడపిల్లలున్న తండ్రి...... ఓ అబ్బాయితండ్రిని ఎందుకు కలుసుకుంటాడు....'' అంతే.

ఆరోజు సాయంకాలం—లక్ష్మితో మాట్లాడుతున్నాడు మూర్తి. "అయితే నెక్స్ట్ పిక్నిక్ మా పెండ్లిలోనేగా....!?...అయినా కంగ్రాచులేషన్స్.... శారద ఈ విషయం ఇవేళే వ్రాసింది......శేఖరాన్ని కూడా కంగ్రాచులేట్ చెయ్యండి!?... మీసమ్మతి వ్రాసెయ్యమంటారా......శారదకి......?"

తక్కినమాటలు విన్పించలేదు మూర్తికి.

ఆ పడవలో శారద పాటపాడటం—శేఖరాన్ని తను ఓడించడం.....కళ్ళముందు మెదిలాయి ఒకసారి. పడవలో మొదలైన ప్రణయం — వివాహంతో ముగిసింది. ★